

సోషలిజంతోనే దేశాభివృద్ధి సాధ్యం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఉండి

దేశంలో ఎన్నడూ లేనివిధంగా గత 25 సంవత్సరాల్లో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని, దేశాభివృద్ధి సాధించాలంటే అది సోషలిజంతోనే సాధ్యమవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల భవనంలో సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్ అధ్యక్షతన సోషలిజం విశిష్టత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రపంచంలో రెండు సమాజాలు ఉన్నాయని, ఒకటి పెట్టుబడిదారీ సమాజం, రెండోది సోషలిస్టు సమాజం అని అన్నారు. మనదేశంలో అదానీ, అంబానీ లాంటి వారి చేతిలో సంపద అధిక శాతం ఉందని, అటువంటి వారికి మద్దతుగా ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తీసుకొస్తున్నాయని ఆయన విమర్శించారు.

సర్పంచి, ఎంపిటిసిలకు.. జీతాల్లేవ్..!

స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష
26 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వని దుస్థితి
ఒక్కో సర్పంచి, ఎంపిటిసికి దాదాపు రూ.లక్ష వరకూ బకాయి
సర్పంచి, ఎంపిటిసిలకు నెల జీతం కేవలం రూ.3 వేలే
ఎంఎల్ఎలకు మాత్రం ఒకటో తేదీనే రూ.లక్షల్లో జీతాలు జమ
వచ్చే మార్చి నాటికి ముగియనున్న సర్పంచుల పదవీకాలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసి పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేసే ప్రజాప్రతినిధులకు ఇచ్చే కొద్దిపాటి గౌరవ వేతనం సైతం ఏళ్లతరబడి పెండింగ్‌లో పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో ఐదు నెల్లలో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. వారికి ఇవ్వాల్సిన వేతన బకాయిల గురించి మాత్రం ప్రభుత్వం నోరు మెదపడం లేదు. గ్రామాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు, ప్రజాప్రతినిధుల జీతాల విషయంలోనూ ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో 956 మంది సర్పంచులు ఉన్నారు. 2020 మార్చిలో వీరంతా సర్పంచులుగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ దాదాపు 55 నెలల కాలం గడిచిపోయింది. మరో ఐదు నెల్లలో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 876 మంది ఎంపిటిసిలు, 48 మంది జెడ్‌పిటిసిలు ఉన్నారు. వీరి పదవీకాలం 2026 సెప్టెంబర్‌తో ముగియనుంది. సర్పంచి, ఎంపిటిసిలకు 26 నెలలుగా, జెడ్‌పిటిసిలకు 36 నెలలుగా జీతాలు అందని పరిస్థితి ఉంది. ఒక్కో సర్పంచి, ఎంపిటిసికి దాదాపు రూ.లక్ష వరకూ జీతాల బకాయి ఉంది. జెడ్‌పిటిసిలకైతే రూ.రెండు లక్షలకుపైగా జీతాల బకాయిలు పెండింగ్ ఉన్న పరిస్థితి. క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పని చేసేది సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు మాత్రమే. నిరంతరం ప్రజలతో మమేకమై స్థానిక ప్రజాప్రతినిధులంతా పని చేస్తుంటారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా జనం తొలుత కలిసేది వీరినే. గ్రామాల్లో జనాల సమస్యలను ఎంఎల్ఎ, ఎంపీ దృష్టికి తీసుకెళ్లేది సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలే. సర్పంచి, ఎంపిటిసిలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం మాత్రం రూ.మూడు వేలు, జెడ్‌పిటిసిలకు రూ.ఆరు వేలుగా ఉంది. 2023 సెప్టెంబర్ నుంచి సర్పంచి, ఎంపిటిసిలకు జీతాలు అనేవి ప్రభుత్వం ఇవ్వలేదు. దాదాపు 26 నెలలుగా వీరికి జీతాలు ఇవ్వడం లేదు. జెడ్‌పిటిసిలకైతే 2022 సెప్టెంబర్ నుంచి ఇవ్వని పరిస్థితి ఉంది. సర్పంచి, ఎంపిటిసిలకు సకాలంలో గౌరవ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సర్పంచి, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలకు జీతాలు ఇవ్వని ప్రభుత్వం ఎంఎల్ఎలకు మాత్రం ప్రతినెలా మొదటి తేదీనే రూ.లక్షల్లో జీతాలు జమ చేస్తోంది. ఎంఎల్ఎలకు జీతాలు సకాలంలో ఇస్తున్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వరనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ సైతం జిల్లా పరిషత్ సమావేశాల్లో మంత్రుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.



నిధుల పరిస్థితీ అంతే..

పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ గత ప్రభుత్వంతోపాటు, ఈ ప్రభుత్వం సైతం సకాలంలో విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. సర్పంచుల పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుంది. గ్రామాల్లో సీసీ రోడ్లతోపాటు చేసిన అనేక పనులకు సంబంధించిన బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఒక్కో పంచాయతీ పరిధిలో తక్కువగా లెక్కించినా రూ.15 లక్షల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇలాగైతే పనులు ఏవిధంగా చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామాల అభివృద్ధే.. దేశాభివృద్ధి అంటూ నినాదాలు ఇవ్వడం తప్ప నిధులు, జీతాల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది.

జీతాలివ్వరు.. పథకాలు మాత్రం కట్..!

సర్పంచి, ఎంపిటిసిలకు సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలను జమ చేసే విధానం తెచ్చారు. సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలు ఇస్తున్న కారణంగా సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు రైతుభరోసా, తల్లికి వందనం వంటి పథకాలు సైతం నిలుపుదల చేసినట్లు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెడుతున్నారు. నెలకు రూ.మూడు వేలు జీతం ఇస్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన సమాధానం రాని పరిస్థితి ఉంది.



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

పేదల భూములు పెద్దలకు కట్టబెట్టేందుకే ఫ్రీహోల్డ్ ఎత్తివేత

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అత్తిలి

పేదలు, దళితుల చేతుల్లో ఉన్న భూములను అప్పనంగా పెద్దలకు కట్టబెట్టడమే ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధం ఎత్తివేయడం అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభ స్థానిక ముస్లిం షాదీఖానా భవనంలో (ఆర్ఎస్ నగర్‌లోని వియస్.అచ్యుతనందన్ ప్రాంగణం) బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, బళ్ల చినవీరభద్రరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మరింత దూకుడుగా దుష్ప్రచారం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు చేసే యంత్రాలకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, అదే వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్న కూలీలకు ఎటువంటి ఉపాధి నిధులూ పెంచడం లేదని అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన మూడు సెంట్లు ఇంటి స్థలం, పేదల భూముల రక్షణ కోసం పెద్దఎత్తున పోరాటం చేపడతామని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో లక్షల కొబ్బరి చెట్లు ఉన్నాయని, వాటిని సంపన్నులకు 99 సంవత్సరాలు లీజుకి ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రతి పేద కుటుంబానికీ 10 కొబ్బరి చెట్లు ఇవ్వాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో పేదలతో కొబ్బరి చెట్ల స్వాధీన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు, చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు ఆవిష్కరించారు. అనంతరం మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన పోరాటాల, ఉద్యమాల నివేదికను జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మహాసభలో ప్రవేశపెట్టగా ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు. కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చైతన్య ప్రసాద్ సౌహార్ధ సందేశాలు ఇచ్చారు. ఈ మహాసభలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, అత్తిలి మండల కార్యదర్శి వనం రాంబాబు, గుబ్బల నాగేశ్వరరావు, నరాలశెట్టి రామకృష్ణ, బండారు వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి నరసింహామూర్తి పాల్గొన్నారు. మహాసభలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, వ్యవసాయ కార్మికులు

మోగల్లు నుండి అత్తిలి వరకు ర్యాలీ

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు పురిటి గడ్డ మోగల్లు నుంచి అత్తిలి వరకు వ్యవసాయ కార్మికులు, నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు వీరవల్లి వెంకటేశ్వరరావు, రామానుజదాస్, వెంకన్న, రామారావు, శివప్రసాద్, కొటికలపూడి శ్రీను, దున్న మరియమ్మ పాల్గొన్నారు.

మహనీయులు అబ్దుల్ కలాం

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి


ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి

ప్రజాశక్తి - భీమవరం

భారతదేశ విద్యావ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర పోరాటంలో గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి నాయకులతోపాటు పోరాడిన వ్యక్తుల్లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత బాగా చదువుకుని ఎటువంటి సమస్యనైనా అధిగమించి అభివృద్ధి సాధించాలన్నారు. మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే సిఎస్ఆర్ నిధులు, బరియల్ గ్రౌండ్ సమస్యను ప్రస్తావించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జెసి తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి హెచ్‌విఎస్.మూర్తి, డిఇఒ ఇ.నారాయణ, ఎపి ఫైనాన్స్ మైనార్టీ కార్పొరేషన్ మెంబర్ ఎమ్‌డి.షబీనాబేగం, స్టేట్ మైనార్టీ సెక్రటరీ ఎమ్‌డి.జాకీర్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎమ్‌డి.నౌషద్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రబ్బాని, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, కోడు వలీభాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కులాలు, మతాల పేరుతో వన భోజనాలు హానికరం

కుల, మత రహిత వనభోజనాలకు ప్రజలు ముందుకు రావాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు

భీమవరం: కులాలు, మతాల పేరుతో వనభోజనాలు నిర్వహించడం సమాజానికి హానికరమని, ఇది ప్రజల మధ్య విభజనకు, విచ్ఛిన్నకర వాతావరణానికి దారి తీస్తాయని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కార్తీక మాసంలో ప్రజలందరూ వనభోజన కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారని తెలిపారు. నేడు జిల్లాలో వన భోజనాలు కాస్తా కుల భోజనాలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి హానికరమని పేర్కొన్నారు. దీనిపై జిల్లా అధికారులు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కులాల భోజనాలకు కొన్నిచోట్ల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా అతిథులుగా హాజరవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి విచ్ఛిన్నకర భోజనాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని, అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండేలా కుల, మత రహిత సామూహిక భోజనాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.


అమరావతిలో ఆలీ జిన్నాను సత్కరిస్తున్న దృశ్యం

మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

నూర్ భాషా దూదేకుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీ జిన్నా

పెనుమంట్ర: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నూర్‌భాషా దూదేకుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీ జిన్నా అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన పొలమూరులో మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడారు. తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగిందన్నారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ ముస్లిం మైనారిటీ సలహాదారు మహమ్మద్ షరీఫ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాగు, ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్ విచ్చేశారన్నారు. ఈ సందర్భంగా తనకు టిడిపి నాయకులు, అభిమానులు, మైనార్టీ నాయకులు చేసిన సత్కారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర మండలం నుండి నేతలు వెలగల బుల్లిరామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, పొలమూరు సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, ఆ గ్రామ టిడిపి అధ్యక్షులు పెన్మెత్స వివేక రాఘవేంద్ర రాజు, జనసేన అధ్యక్షులు తోరం వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారని వివరించారు.

కాళ్ల జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం సస్పెండ్

కాళ్ల: విద్యాశాఖ ఆర్‌జెడి ఆదేశాల మేరకు కాళ్ల జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పి.భాగ్యలక్ష్మిని సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారని కాళ్ల ఎంఇఒ-2 పాలా యేసుదాసు తెలిపారు. కాళ్ల హైస్కూల్లో 450 మంది విద్యార్థులకు 150 మంది మాత్రమే భోజనం చేస్తున్నారని నివేదికలో విచారణలో తేలిందని, ఈ నేపథ్యంలో హెచ్‌ఎంను సస్పెండ్ చేశారని వివరించారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు : జెసి

భీమవరం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అవసరమైన గోనె సంచులన్నీ ఆర్ఎస్‌కెల్లో అందుబాటులో ఉంచాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులతో సమీక్షించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు మొదలైనందున రానున్న రోజుల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని మండలాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన గోనె సంచులను అన్ని రైతు సేవాకేంద్రాల్లోనూ అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎమ్‌డి.ఇబ్రహీం, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖాధికారి మురళీకృష్ణ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, మార్కెటింగ్ ఎడి ఎం.సునీల్ కుమార్, జిల్లా రవాణా శాఖాధికారి కెఎస్ఎమ్‌డి.కృష్ణారావు, లీగల్ మెట్రాలజీ అకౌంటెంట్ నాగబాబురావు, సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ మేనేజర్ పిడి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రయివేటు బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశవ్యాప్తంగా ప్రయివేటు రంగ బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా మంగళవారం పట్టణంలో బ్యాంకు కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఐడిబిఐ, ఐసిఐసిఐ బ్యాంకు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి టివి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రయివేటుబ్యాంకు బ్యాంకు ఉద్యోగులు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. అన్ని బ్యాంకుల ఉద్యోగులకు జాతీయ బ్యాంకు ఉద్యోగులతో సమానంగా సర్వీసు కండీషన్లు అమలు చేసి న్యాయం చేయాలన్నారు. కన్వీనర్ ఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అన్ని బ్యాంకుల ఉద్యోగులూ ఒకేవిధమైన పనులు చేస్తుంటే జీతభత్యాల్లో, సర్వీసు నిబంధనల్లో తేడాలు ఉండకూడదన్నారు. జాతీయ బ్యాంకులను విలీనాల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ప్రసాద్ విమర్శించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు యూనియన్ నాయకులు విఆర్ఎస్ఎన్.శాస్త్రి, ఇండియన్ బ్యాంకు యూనియన్ చైతన్య మాట్లాడారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టివి.సూర్యనారాయణ

మళ్లీ పోరుబాటకు సిద్ధం

వీరవాసరంలో అంగన్వాడీల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - వీరవాసరం

అంగన్‌వాడీలు మరోసారి పోరుబాటకు సిద్ధం కానున్నారని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, పనిచేసే సెల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వీరవాసరంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పనిచేయని సెల్ ఫోన్లతో పనిచేయలేమని, ఫోన్లు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారని అన్నారు. ప్రభుత్వం యూనియన్‌తో చర్చలు జరిపి యాప్‌ల ఒత్తిడి తగ్గిస్తామని, త్వరలోనే 5జి సెల్ ఫోన్లు అందిస్తామని వాగ్దానం చేసి మూడు నెలలైందని తెలిపారు. ఆన్‌లైన్ వర్కులు మరింత పెరిగాయే తప్ప తగ్గలేదని తెలిపారు. సెల్ ఫోన్లతో కుస్తీలు పట్టడం తప్ప ఉపయోగం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ 18 మాసాల కాలంలో స్కీం వర్కర్లకు కానీ కాంట్రాక్ట్ వర్కర్లకు కానీ ఒక నయా పైసా జీతం పెంచలేదని తెలిపారు. ప్రభుత్వాలు మారినా ధరలు పెరుగుతున్నాయి తప్ప జీతాలు మాత్రం పెరగలేదని తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి రోడ్డెక్కడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సహకారం: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, ఔత్సాహికులు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెద ఈర్లపాడులో ఎంఎస్ఎంఇ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీంతో పాటు 17 జిల్లాల్లో ఏర్పాటు చేసిన మరో 49 ఎంఎస్ఎంఇ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోనూ సిఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భీమవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలోనే పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు మంజూరు చేయడం జరిగిందని, రెండో విడత కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, ఎపిఐఐసి విజయవాడ డిజెడ్ఎం ఎం.ఎ.రహీం, మాజీ ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, కూటమి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

నెట్‌బాల్ పోటీల్లో గొరగనమూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ - 17 నెట్ బాల్ పోటీల్లో గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 నెట్ బాల్ పోటీల్లో జిల్లా నెట్ బాల్ బాలికల జట్టు ప్రథమ స్థానం, బాలుర జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ఈ జట్లలో గొరగనమూడి స్వామి జ్ఞానానంద విద్యార్థినులు డి.జోత్స్న నాగసాయి, కె.గుణ వర్షిత, ఎ.పోషిత, టి మహాలక్ష్మి, పి.శృతి ప్రథమ స్థానం, బాలురు భాగంలో ఎస్.మహేష్, కె.లోకేష్, జి.సురేష్, కె.ప్రవీణ్‌కుమార్, బి.రమేష్, పి.మున్నా ద్వితీయ స్థానం సాధించారని హెచ్‌ఎం బి.శ్రీదేవి తెలిపారు. రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి రాణించి గెలిచిన విద్యార్థులకు మెడల్స్, ట్రోఫీలు అందించి హైస్కూల్ హెచ్‌ఎం బి.శ్రీదేవి, పిడి ఎన్.విజయలక్ష్మి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.


నెట్‌బాల్ పోటీలో రాణించిన క్రీడాకారులు వీరే

ఆక్వా ఉత్పత్తుల్లో జిల్లాను మేటిగా నిలపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ఆక్వా రైతులు ఇంటర్నేషనల్ ఆక్వా ఎక్స్‌పో ద్వారా ఆక్వాకల్చర్ రంగంలో తాజా ఉత్పత్తులు, సేవలు, సాంకేతికతలపై పూర్తి అవగాహన పొంది, ఆక్వా ఉత్పత్తుల్లో జిల్లాను మేటిగా నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఇంటర్నేషనల్ ఆక్వా ఎక్స్‌పో హైదరాబాద్ ఆక్వా సదస్సుకు జిల్లా నుండి వెళ్తున్న 40 మంది ఆక్వా రైతులకు ఏర్పాటుచేసిన టూరిస్ట్ బస్సును ఆమె జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వరల్డ్ ఆక్వాకల్చర్ 2025 ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆక్వా ఎక్స్‌పో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 13 వరకూ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎల్ఎల్ఎన్.రాజు, ఆర్.ప్రసాద్, మత్స్య శాఖ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి దుకాణంలోనూ కూరగాయల ధరలను సూచించే బోర్డులను విధిగా ప్రదర్శించడంతోపాటు యజమాని పేరు, షాపు నెంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక జివిఆర్ మున్సిపల్ డైలీ కూరగాయల మార్కెట్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయల షాపుల యజమానులతో మాట్లాడారు. అధిక ధరలకు కూరగాయలను అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిడ్నీ బాధితునికి సాయం

ప్రజాశక్తి - నరసాపురం

వేములదీవి పడమర కాపుల కొడప గ్రామానికి చెందిన ఉంగరాల మురహరి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆ కుటుంబానికి ఆ గ్రామ యువజన సంఘం, పెద్దలు అండగా నిలిచారు. మానవతా దృక్పథంతో గ్రామంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో రూ. 80 వేలు నగదు సేకరించారు. వితరణ నిమిత్తం మంగళవారం రూ.80 వేలు మురహరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌కు అవార్డుల పంట

ప్రజాశక్తి - నరసాపురం

భీమవరంలో ఆదివారం జరిగిన వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ సమావేశంలో నర్సాపురం వాసవి క్లబ్‌కు బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ ట్రెజరర్ అవార్డులతోపాటు వివిధ విభాగాల్లో 11 అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రెసిడెంట్‌గా ఉన్న డాక్టర్ నూలి శ్రీనివాసు 2026 జోన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్లు యూదా నాగేశ్వరరావు, నూలి వెంకట రమణమూర్తి, గవర్నర్ ప్రసాద్, 2026 గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు నిమ్మల వేణుబాబు ఆధ్వర్యంలో గ్రామ నుంచి స్వచ్ఛందంగా సంతకాలను సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యా దూరం చేయాలనే లక్ష్యంతో పిపిపి విధానాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. నాయకులు రొక్కల బన్ను, కోట గిరిధర్, బొంతా సుబ్బారావు, సల్లపూడి పుష్పరాజు, పోలిశెట్టి వనమరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి, కె.ఓంకార్ నాథ్ చెప్పారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో జరిగిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయాల నుంచి వచ్చిన 73 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలు పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా 9, 10 తేదీల్లో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు చేసి సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు కోసూరి రామకృష్ణ ఆనందరాజు మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా రక్త శాతం పరీక్షలు, ఇతర పరీక్షలు చేయించుకుని, బిడ్డ ఎదుగుదలకు అదనపు పోషకాహారం తీసుకోవడం ఎంతైనా అవసరమని తెలిపారు. అనంతరం 35 మంది గర్భిణులకు పోషకాహారం కిట్లు, పెరుగన్నం బాక్సులు అందించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రామకృష్ణ ఆనందరాజు, కార్యదర్శి పి.సత్యనారాయణ, సీనియర్ రొటేరియన్ చందక రాము, పిహెచ్ ఎన్‌పి.ఎలిజిబెత్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు, ఫార్మసిస్ట్ పివి.స్వామి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాలకొల్లు : జాతీయ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు శాఖ గ్రంథాలయ అధికారి వర్ధనపు శాంతకుమారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు వారం రోజులపాటు విద్యార్థులకు నిర్వహించే పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచనల మేరకు నూతనంగా నియమితులైన గ్రంథాలయ అభివృద్ధి కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా నియమితులైన వంగా నరసింహారావు కమిటీ సభ్యులను పరిచయం చేశారు. ఉపాధ్యక్షులుగా పీతల వెంకట ఆనంద్, కార్యదర్శిగా కెవిపి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా జి.సీతారాం, ట్రెజరర్, కన్వీనరుగా లైబ్రేరియన్ వి.శాంతకుమారి, సభ్యులుగా పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, ఎం.కృష్ణ ప్రసాద్, బైలా శ్రీధర్ తదితరులు నియమితులైనట్లు శాంతకుమారి మీడియాకు వెల్లడించారు.

ఘనంగా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక డిగ్రీ కాలేజీలో మంగళవారం మౌలానా అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలాం స్వాతంత్ర పోరాట సమరం నాయకుల్లో ఒకరని అన్నారు. ప్రజలలో జాతీయ చైతన్యం కలిగించడానికి పత్రికలు నడిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణీ, లెక్చరర్లు, కెవి.గణేష్, జివి.రమణ. జి.వెంకట్రావు, జివి శారదాదేవి పాల్గొన్నారు.

పాలకోడేరు : భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. దేశ మొదటి విద్య శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్య దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఆయన ఆలోచనలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్.మనోహర్ పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, పాలకొల్లు తెలుగు, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వి.యామిని మాట్లాడారు. నేటి యువత అబుల్ కలాం ఆజాద్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఐక్యూఎసి కో ఆర్డినేటర్ కె.భద్రాచలం, జూవాలజీ విభాగాధిపతి ఎం.రామకృష్ణ, అధ్యాపకులు సిహెచ్.ఉషారాణి పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ స్కూల్లో హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడి ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టి.జనార్ధన్ మాట్లాడుతూ ఏటా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ పుట్టినరోజున విద్యా దినోత్సవం జరుపుకుంటారని చెప్పారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, లీలాకుమారి, రోజా పాల్గొన్నారు.

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబ్జీ

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం పట్టణం చినమామిడిపల్లికి చెందిన పాలూరి నరసింహారావు (బాబ్జీ)ను ప్రభుత్వం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం బాబ్జీ నరసాపురం 31వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే వారికి ఏదో ఒక రోజు గుర్తింపు వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవిని అందించిన సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రభుత్వ సలహాదారు ఎంఎ షరీఫ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్ఎను కలిసిన బాబ్జీ

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పాలూరి బాబ్జీ ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్ఎ నాయకర్ బాబ్జీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ దేశనీడి గంగాధర్, పడాల మోహన్‌రావు, ఇంటి మురళి, గునిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

నీటి ప్రవాహానికి ఆటంకం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నుంచి మొగల్తూరు వరకూ సుమారు 12 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ప్రధాన పంట కాలువ నిండా గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ప్రవాహం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఈ కాలువ ద్వారా నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 8,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. సుమారు 40 గ్రామాల్లో భారీ రక్షిత నీటి ప్రాజెక్టులకు, చెరువులకు నీరు సరఫరా అవుతుంది. కొద్ది రోజులుగా కాలువలో నీరు కూడా కనిపించకుండా గుర్రపు డెక్క పేరుకు పోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై జల వనరుల శాఖ డిఇ సిహెచ్ వెంకట నారాయణ స్పందిస్తూ సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు.



సీతారామపురంలో కాలువ లో పేరుకు పోయిన గుర్రపు డెక్క

నాలుగో వార్డు ఆర్‌పిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్నో ఏళ్లుగా మెప్మాలో ఆర్‌పిగా పని చేస్తున్న సుగుణను విధులకు దూరం చేయడం దారుణమని, దీనికి ఆ శాఖ అధికారులు బాధ్యత వహించాలని సహాయ సొసైటీ ఫౌండర్ సత్య సుధామ అన్నారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని ప్రభుత్వం డ్వాక్రా వంటి పథకాలను తీసుకొచ్చిందని తెలిపారు. అయితే కొందరు అధికారులు కావాలని సుగుణను ఇబ్బంది పెట్టేవిధంగా నిరుద్యోగ జీవితంతో ఆడుకుంటున్నారన్నారు. నాలుగో వార్డు ఆర్‌పి సుగుణ 15 ఏళ్లుగా పనిచేస్తోందని, ఆమె కుటుంబానికి ఈ ఉద్యోగం ఎంతో అవసరమని తెలిపారు. ఆమెను వేధించడం వల్ల అధికారులకు ఏం కలిసొస్తుందని ప్రశ్నించారు. ముఖ్యంగా ఇక్కడ గతంలో సిటీ ప్లానర్‌గా పనిచేసిన నాని బాబు ఈమెను మెప్మా లాగిన్ నుండి తొలగించారన్నారు. తర్వాత వచ్చిన సుధాకర్ కూడా ఈమెకు అన్యాయం చేశారని, లాగిన్‌లో సుగుణను కాకుండా ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మహిళా ఆకర్స్ యాప్‌లో గ్రూపులోని ఒక సభ్యులకు లాగిన్ జాయిన్ చేయడం ఎంతవరకూ సబబు అని ఆమె ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని బాధితురాలైన సుగుణకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మెప్మా కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతులతోపాటు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బిసి సంక్షేమ వసతి గృహాలైన సంక్షేమ హాస్టల్లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా నరసయ్య అగ్రహారంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాల బాలికల వసతి గృహం, పాఠశాల బాలుర వసతి గృహాలను విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, తాగునీరు, భద్రతా ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బిసి సంక్షేమ శాఖా మంత్రి సవిత ఆదేశాల మేరకు బిసి హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. వీటిలోని లోటుపాట్లను స్థానిక శాసనసభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి తెలియజేసి సౌకర్యాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట టిడిపి పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, విన్నకోట వినాయక్ బాబు, మద్దుల సాయిరాం, గొలగాని రాంబాబు, కూటమి నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాల వితరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

భగ్గేశ్వరం గ్రామం సత్యనారాయణపురంలో శ్రీ సంపద వినాయకుని ఆలయ నిర్మాణానికి అవసరమైన 30 సిమెంట్ బస్తాలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్, మంత్రి రామానాయుడును ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కలిసి సిమెంట్ బస్తాలు ఇప్పించాలని కోరగా ఫౌండేషన్ నుంచి సమకూర్చారు. ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాలు ఇచ్చినందుకు మంత్రి రామానాయుడుకు ఆలయ కమిటీ నిర్వహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాముల రజినీ కుమార్, నిల్ల వీరభద్రరావు, దొడ్డిపట్ల రామలింగం, చల్ల కోట మల్లయ్య, అల్లం పరదేశి, వాస నరసన్న, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు

ప్రజాశక్తి - మొగల్తూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉజ్వల యువజన పథకం ద్వారా పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కలెక్షన్లు ఇవ్వనున్నామని మొగల్తూరులోని లక్ష్మీ హరిప్రియ హెచ్‌పి గ్యాస్ నిర్వాహకులు అనంతపల్లి గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. గ్యాస్ కలెక్షన్ పొందాలనుకునే మహిళలు ఆధార్, తెల్లరేషన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఎస్‌సి, ఎస్‌టిలు అయితే కుల ధ్రువీకరణ పత్రాలతో తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దగ్గులూరులో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

దగ్గులూరులో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా రజకుల చెరువు గట్టు వద్ద 100 కెవి, గవరపేట కాలనీలో 16 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి రామానాయుడు ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు ఒకే రోజు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యుత్ శాఖ డిఇ రామకృష్ణ, ఎఇ శ్రీనివాసు, ఎల్‌ఐ శ్రీనివాసు, నాయకులు సర్పంచి కనకభద్రం, టిడిపి మండల అధ్యక్షులు పాముల రజినికుమార్ పాల్గొన్నారు.

ఉండిలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో అభయాంజనేయ స్వామి 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద మంగళవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచి చిక్కాల జగదీష్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. మానే ప్రసాద్, కొమ్మన నాగబాబు, మానే శ్రీనివాస్, చినమిల్లి సుబ్బయ్య, చిక్కాల సత్యనారాయణ, ఏడిద నెహ్రూ పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధి హామీని చట్టాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. ఉపాధి హామీ చట్టం గ్రామ సభను మంగళవారం వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ వర్మ మాట్లాడుతూ పథకం నిర్వహణలో కూలీల నిబంధనలు మారాయన్నారు. కూలీలు పని ప్రారంభం నుండి పూర్తయ్యే వరకూ ఉండాలన్నారు. పని చేసేటప్పుడు జిపిఆర్ఎస్‌తో కూడిన 12 ఫొటోలు తీయడం జరుగుతుందన్నారు. పని జరిగిన ప్రాంతాన్నంతటినీ ఫొటో తీయాల్సి ఉందన్నారు. ఒక కూలీ వంద రోజులు పని దినాలు పూర్తి చేస్తేనే మేట్‌కు అదనపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీ, వీరవాసరం సొసైటీ ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, వీరవాసరం నీటి సంఘం అధ్యక్షులు గవిరెడ్డి చిన్నారావు, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, కూలీలు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగించే బాధ్యత నాది

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద మురుగు కాలువలోని గుర్రపు డెక్క, తూడు తొలగింపుతో పాటు పూడికతీత, కాలువ వెంబడి ఆక్రమణ తొలగించే బాధ్యత తనదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు రైతు సమస్యలపై పోరాట నాయకులు కూనప రెడ్డి వీర వెంకట విజయ రంగారావుకు, రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. సోమవారం మురుగు కాలవను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని పొత్తూరి ఆదేశించారు. రైతుల సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చిన వెంకట విజయ రంగారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో రైతులు కంబాల మామాజీ, యడ్లపల్లి అర్జునుడు, జి.బాబ్జి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకున్నవారికే సంచులు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో పంట నమోదు చేసుకున్న రైతులకే సంచులు అందజేస్తామని వ్యవసాయ శాఖాధికారి జిఎస్.ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అధ్యక్షత వహించారు. ఎంపిడిఒ బేబిశ్రీలక్ష్మి మూడు నెలల మండల ప్రగతిని వివరించారు. సరిపల్లి సర్పంచి చలుమూరి లక్ష్మీ భవాని మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న బస్టాప్ వద్ద ఆర్‌టిసి బస్సు నిలపడం లేదన్నారు. స్టాఫ్ వద్ద బస్సు నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో పలు ప్రాంతాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఢిల్లీలో జరిగిన భారీ పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి భీమవరం పట్టణంలోని బస్టాండ్, జంక్షన్ రైల్వే స్టేషన్, టౌన్ రైల్వే స్టేషన్‌తో పాటు, పట్టణంలోని లాడ్జీలు, సినిమా హాల్లో, షాపింగ్ మాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అలాగే రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఎవరైనా అనుమానంగా తిరిగితే తక్షణం స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన రొయ్యల కంటైనర్

డ్రైవర్‌కు గాయాలు - తప్పిన ప్రమాదం

పాలకొల్లు రూరల్: పాలకొల్లు - నర్సాపురం జాతీయ రహదారి పింకుళ్లపాడు సమీపంలో నరసాపురం నుంచి పాలకొల్లు వస్తున్న రొయ్యల కంటైనర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచారం మేరకు ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బైక్‌లో నగదు చోరీ

రూ.2 లక్షలు అపహరణ

నరసాపురం: బైక్‌లో పెట్టిన నగదును గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ కాపులకొడప గ్రామానికి చెందిన ఉంగరాల శ్రీనివాస్ పట్టణంలో ఓ బ్యాంకు నుంచి కూలీలకు ఇవ్వాలని రూ.2 లక్షలు డ్రా చేశాడు. ఇంటికి వెళ్తు శ్రీనివాస్ మార్గ మధ్యలోని పంజా సెంటర్‌లో బుల్లెట్ బైక్‌లో ట్యాంక్ కవర్‌లో నగదు పెట్టి టిఫిన్ చేశాడు. టిఫిన్ చేసి తిరిగి వచ్చేసరికి బైక్‌లో పెట్టిన నగదు కనిపించలేదు. వెంటనే శ్రీనివాస్ సీసీ కెమెరాలులో చూడగా టోపీ పెట్టుకుని వచ్చి ఓ వ్యక్తి నగదు పట్టుకుని వెళ్లి పోయాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సర్పంచులు పంచాయతీలను ఆర్థికంగా పటిష్ట పర్చాలి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామ పంచాయతీ పరిధిలో విధించే అన్ని రకాల పన్నుల రుసుములూ తప్పక విధించి వసూలు చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన మండల సర్పంచులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంపాట ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థిక వనరులు మెరుగుపర్చుకునేందుకు ప్రభుత్వ భూముల్లో ఖాళీ స్థలాల్లో ఫల సాయాన్ని అందించే చెట్లు, పండ్ల తోటలను పెంచాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సమగ్ర వార్షిక ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలందించడంలో జవాబు దారీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేషబాబు, సర్పంచులు గుబ్బల మాధవరావు, గణేశుల శేషవాణి, దిరిశాల విజయలక్ష్మి, ఇఒపిఆర్‌డి బుల్లి సూరన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండి: గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఉన్న అన్ని మార్గాలనూ సద్వినియోగం చేసుకునేలా సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఎంపిడిఒ ఎంవివిఎస్.శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో శిక్షణ సమావేశం మంగళవారం నిర్వహించారు. పంచాయతీల వారీగా పన్ను వసూళ్లు, ఇంటిపన్నుల నూతన అసెసమెంట్స్ తయారీ, ఇతర ఆదాయ వనరులపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి.రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకివీడు : గ్రామ పంచాయతీలను ఆర్థికంగా పటిష్ట పర్చాలని, అవసరమైన చర్యలు పంచాయతీలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.బాబూరావు సర్పంచి, కార్యదర్శులకు సూచించారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, గ్రామ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎండిఒ ప్రారంభించి మాట్లాడారు. ముందుగా గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, తాగునీరు వీధిలైట్లు, రోడ్లు అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ మార్కండేయశ్వరరావు మాట్లాడారు. పంచాయతీల్లో పూరిపాకలు తీసేసి ఇల్లు కట్టిన చోట పన్ను విధించకపోవడం కుళాయిలను పూర్తిగా పరిగణలోకి తీసుకోపోవడం వంటి వాటిపై శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ప్రత్యేక శిక్షకులుగా చెరుకుమిల్లి పంచాయతీ కార్యదర్శి శంకరం వ్యవహరించారు. గ్రామ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ పోటీతత్వంతో పనిచేయాలని ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు) అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెలమూరు గ్రామ కార్యదర్శి వి.జ్ఞానపవన్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ప్రతి గ్రామంలో స్థానిక వనరులు గుర్తించి, పంచాయతీ ఆదాయం ఎలా పెంచుకోవాలో వివరించారు. ఎంపిడిఒ ఎన్ఎస్‌జె కృష్ణమూర్తి మాట్లాడుతూ పంచాయతీల ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ఆ విధంగా వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని సర్పంచులు తమనంపూడి వీరెడ్డి (జుత్తిగ), బుర్రా రవికుమార్ (ఓడూరు), దొంగ మహాలక్ష్మి (మల్లిపూడి), గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది రొంగల ప్రేమసాయి పాల్గొన్నారు.

నరసాపురం : ఉత్తమ దేశ పౌరులుగా రాణించేందుకు విద్యార్థులు మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తహశీల్దార్ అయితం సత్యనారాయణ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం సీతారాంపురం సౌత్‌లో 216 జాతీయ రహదారిపై జై బీరా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అబ్దుల్ కలాం ఆజాద్ విద్యా వేత్తగా ఆధునిక భారతీయ విద్యకు పునాది వేశారన్నారు. కార్యక్రమంలో జై బీరా పాఠశాల డైరెక్టర్ జోసఫ్ పిన్నీ, శారా జోసఫ్, సర్పంచి దొండపాటి వెంకట్, ప్రిన్సిపల్ పి.జయరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వికె.మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడారు. అధ్యాపకులు కె.అన్నవరం, బి.శ్రీలక్ష్మి, ప్రేమ జ్యోతి, కె.మురళీకృష్ణ, జి. శ్రీనుబాబు పాల్గొన్నారు.

నరసాపురం : గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని జిల్లా రిసోర్స్ పర్సన్ ఐఎన్.రాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు సొంత వనరులు పెంచుకోవాల్సిన ఆవశ్యకతపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలు ఇంటి పన్నులు, ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లపై మాత్రమే ఆధారపడడం వల్ల గ్రామాలు అభివృద్ధికి నోచుకోవన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే హోర్డింగ్లు, వారపు, రోజు వారీ సంతలు, జాతరల్లో వేసే స్టాల్స్ నుంచి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ, పోరంబోకు భూముల్లో ఉండే కొబ్బరి చెట్లకు పన్ను వేయొచ్చన్నారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన తర్వాత వాటికి పన్ను వేయడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వికె.వీరభద్రరావు, ఉప ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

13న శ్రీసూర్యలో జాబ్ మేళా

నరసాపురం: శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్తంగా ఈ నెల 13వ గురువారం ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఈ మేళాను ప్రారంభించనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉండి, పదో తరగతి ఆపై చదివినవారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ప్రతిష్టాత్మక కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ ప్రెసిడెంట్ మంటిపాల బ్రహ్మాజీ తెలిపారు. మరిన్ని వివరాలకు కె.నాగేంద్ర 95020 24765, 82978 81777 సంప్రదించాలన్నారు.

ఆసక్తికరంగా టెన్నిస్ టోర్నమెంట్

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుద్ధవరపు రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు నరసాపురంలోని 2 కోర్టుల్లో, పాలకొల్లులోని 2 కోర్టుల్లో రెండవ రోజు మంగళవారం ఆసక్తిగా జరిగాయి. 45, 55, 65, 70 సీనియర్స్ విభాగాలుగా జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి పేర్లను ఆర్గనైజింగ్ కార్యదర్శి గొట్టుముక్కల భూన్ రాజు వెల్లడించారు.